క్లుప్తంగా

గ్యాస్ ధర పెంపు దారుణం



మార్టూరులో కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన తెలుపుతున్న మహిళలు

మార్టూరు: వంట గ్యాస్ ధర పెంపుకు నిరసనగా మండల కేంద్రం మార్టూరులో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిరసన తెలిపారు. వంట గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం 50 రూపాయలు పెంచిన నేపథ్యంలో స్థానిక మహిళలు కట్టెల పొయ్యితో వంట చేస్తూ తమ నిరసనను తెలిపారు. నాయకులు బోడెం పూడి సూరిబాబు, బత్తుల హనుమంతరావు, బి. లక్ష్మి, సామ్రాజ్యం, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

11న ప్రసన్నాంజనేయుని తిరునాళ్ల



అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి

బల్లికురవ: మండలంలోని కూకట్లపల్లి గ్రామ సమీపంలోని బొగ్గుల కొండవద్ద వేంచేసిఉన్న యోగప్రసన్నాంజనేయ స్వామి 48 వ వార్షిక తిరునాళ్ల శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ తాళ్ల శివశంకరరెడ్డి మంగళవారం తెలిపారు. తిరునాళ్ల ఏర్పాట్లలో భాగంగా ఆలయాన్ని ముస్తాబుచేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ వేడుకల్లో గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లోని భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ చైర్మన్ కోరారు.

శింగరకొండలో ధ్వజ స్తంభం తొలగింపు



శింగరకొండలో ధ్వజస్తంభాన్ని తొలగిస్తున్న దృశ్యం

అద్దంకి రూరల్: ప్రముఖపుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలోని ధ్వజస్తంభం పాడైపోవటంతో దానిని మంగళవారం రెవెన్యూ, పంచాయితీ, పోలీస్‌శాఖ పంచానామ నిర్వహించి వారి సమక్షంలో తొలగించారు. దేవస్థానం ఏసీ తిమ్మనాయుడు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ మండప నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

అద్దంకి: శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన ముఖ మండప నిర్మాణానికి దాతల చేయూతనిస్తున్నారు. మంగళవారం పట్టణంలోని నర్రావారిపాలెంకు చెందిన నర్రా వెంకటరావు, రంగనాయకమ్మల జ్ఞాపకార్థం తకుమారుడు నర్రా గోపాలరావు ధర్మపత్ని బసవమ్మ రూ.1,00,116 విరాళంగా ఏసీ తిమ్మనాయకుడుకి అందజేశారు. తిమ్మసముద్రంకు చెందిన నాయుడు వీరయ్య చౌదరి భార్య రాజ్యలక్ష్మి రూ.1,00,116 అందజేసినట్లు ఏసీ తిమ్మనాయకుడు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రచారం



అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

అద్దంకి: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు బడిలో పిల్లలను చేర్పించడం కోసం చురుకుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం మండలంలోని వెంపరాల ప్రాథమికోన్నత పాఠశాలలో చక్రాయపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేవీ శ్రీనివాసరావు ఉపాధ్యాయులు కలియతిరిగారు. పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. బడిలో పిల్లలకు అందుతున్న ఒత్తిడి లేనివిద్య, ప్రభుత్వం అందిస్తున్న ఒత్తిడి లేనివిద్య గురించి వివరించారు.

రహదారిది ఏదారో?

- వేటపాలెం- చీరాల ప్రధాన రహదారి నిర్వహణ అస్తవ్యస్తం
- డివైడర్ మధ్య ఎండిపోతున్న మొక్కలు
- వెలగనంటున్న వీధిలైట్లు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



వేటపాలెం- చీరాల ప్రధాన రోడ్డు మధ్య డివైడర్‌పై ఎండిపోయిన చెట్లు

వేటపాలెం: నియోజకవర్గ కేంద్రం చీరాల నుంచి వేటపాలెం వరకు దాదాపు 9 కిలో మీటర్లు ఉన్న ప్రధాన రహదారి నిర్వహణ అస్తవస్యస్తంగా మారిది. డివైడర్ల నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. డివైడర్లపై వేసిన మొక్కలు ఎండిపోవడమే కాకుండా వాటి నిర్మాణాలు కూడా శిథిలావస్థకు చేరుకోవడం గమనార్హం. చీరాల నుంచి వేటపాలెం వరకు గల ప్రధాన రహదారి పక్కనే ఉన్న నాలుగు గ్రామ పంచాయతీ కార్యదర్శులే దీనికి కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు డివైడర్‌పై మొక్కలు పచ్చగా సుందరంగా ఉండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని గ్రామ పంచాయతీలకు కొత్త కార్యదర్శులను ఏర్పాటు చేశారు. దీంతో తమను ప్రశ్నించేదెవరులే, అనే రీతిలో వ్యవ హరిస్తున్నారు. దాదాపు 13 ఏళ్ల క్రితం చీరాల నుంచి వేటపాలెం వరకు గల రోడ్డును విస్తరించారు. గతంలో ఉన రెండు లైన్ల రోడ్డును నాలుగు లైన్లుగా మార్పు చేశారు. మధ్యలో నాలుగు అడుగుల మేర వెడల్పుతో డివైడర్లు ఏర్పాటు చేశారు. వాటి మధ్యలో అందమైన పూల చెట్లు, మొక్కలు నాటి.. నీరంతరంగా నీరు అందించేందుకు డ్రిప్ పైపులు ఏర్పాటు చేశారు. డివైడర్ల మధ్యలో ఆయా పంచాయతీల ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలు, లైట్లు ఏర్పాటు చేశారు.

పిచ్చి మొక్కలే..

అప్పటి వరకు డివైడర్లు, మొక్కలు, లైట్ల నిర్వహణ సక్రమంగానే ఉన్నా.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా పంచాయతీలకు వచ్చిన కొత్త కార్యదర్శులు డివైడర్ల మెయింటినెన్స్ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఏపుగా పెరిగి పచ్చని చెట్లు నీరు అందక ఎండిపోయాయి. డివైడర్ పై పిచ్చి చెట్లు మొలిచాయి. కొన్ని చోట్లు పగిలిపోయాయి. అలాగే వీధిలైట్లు పాడై పోయాయి. డివైడర్లపై అందమైన చెట్లు ఎండిపోవడంతో కళావిహీనంగా మారింది.

అడిగే వారుంటేగా..

చీరాల నియోజవర్గం పరిధిలో ఐదేళ్లగా గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోచుకోలేదు. అప్పటి నుంచి ప్రత్యేకాధికారులే నెట్టుకొస్తున్నారు. ప్రజాప్రతినిధులు ఐదేళ్లగా లేక పోవడంతో గ్రామ పంచాయతీలు అవినీతి మయంగా మారిపోయాయి. తాము ఏమి చేసినా అడిగే వారెవరుంటారులే అనే ధీమాతో రోడ్డు.. డివైడర్‌పై ఉన్న పచ్చని చెట్లను ఎండబెడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వ భూములు కాపాడండి



మాట్లాడుతున్న నాయకులు రామయ్య యాదవ్

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములను అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకొని కాపాడాలని సమ సమాజం పార్టీ జాతీయ నాయకుడు రామయ్య యాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక రామ్ జనార్ధన్ కాలనీ సమీపంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మార్టూరులోని సర్వేనెంబర్ 342లో 2.20 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల దాఖలా చెరువు పోరంబోకుగా ఉందని ఆ భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు ప్లాట్లుగా వేసి విక్రయించడాన్ని అధికారులు అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను ఈ విధంగా ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకోవడం వలన భవిష్యత్తులో భూమిలేని పేదవారికి ఇళ్ల స్థలాలు ఇవ్వటానికి భూములే మిగలవని.. రెవెన్యూ అధికారులు ప్రజాప్రతినిధులు కలుగజేసుకొని ప్రభుత్వ భూముల విక్రయాలు ఆపాలని కోరారు. బాచిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్టీఓగా నిజాముద్దీన్



ఎస్టీఓ నిజాముద్దీన్

చీరాల టౌన్: చీరాల ఉపఖజానా కార్యాలయం ద్వారా ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులతో పాటు బిల్లుల చెల్లింపులో ఎలాంటి వివాదాలు లేకుండా సమర్థవంతంగా, సత్వరంగా విధులు నిర్వహిస్తానని నూతన ఉపఖజనాధికారి సయ్యద్ నిజాముద్దీన్ అన్నారు. చీరాల ఉపఖజనా కార్యాలయానికి నూతన ఎస్టీవోగా నిజాముద్దీన్‌ను నియమించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎస్టీవోగా పనిచేస్తున్న సుబ్బారావు బాపట్ల ఎస్టీవోగా విధులు నిర్వహిస్తున్నారు. తిరుపతి జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నిజాముద్దీన్‌ను ఎస్టీఓగా పదోన్నతి కల్పించి చీరాల ఎస్టీఓగా నియమించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యూటీ చార్ట్ ప్రకారం పనిచేయాలని ఆదేశాలిచ్చానన్నారు. అన్ని రకాల బిల్లులు త్వరగా ఉన్నతాధికారి కార్యాలయానికి పాస్ చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చామన్నారు. సిబ్బంది వివాదాలు లేకుండా విధులు నిర్వహించాలని మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. నూతన ఎస్టీవో నిజాముద్దీన్‌ను పలు ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

పట్టాభిషేకంతో గ్రామోత్సవం





కొప్పరపాలెంలో సీతారాముల ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం , రథం లాగుతున్న భక్తులు

బల్లికురవ: శ్రీరామనవమి వేడుకలు ముగింపులో భాగంగా సోమవారం రాత్రి మండలంలోని కొప్పరపాలెం గ్రామంలో శ్రీరామ పట్టాభిషేకం రథంతో గ్రామోత్సవం చేపట్టారు. గ్రామ కూడలిలోని రామాలయంలో ఈ ఏడాది శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించే వంతు యాదవ కులస్తులకు దక్కింది. శనివారం రాత్రి నుంచి వేడుకలు అంకురార్పణలో భాగంగా ఆలయాన్ని ముస్తాబుతో విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయం ముందు తాటి ఆకులతో చలువ పందిరి ఏర్పాటుతో 40 గంటలు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అర్చకులు రంగాచార్యులచే పంచామృతాలతో శ్రీరామ పట్టాభిషేకం ప్రత్యేక అలంకరణ ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి ప్రత్యేక అలంకరణతో మేళతాళాలు, డప్పువాయిద్యాలతో గ్రామోత్సవం చేపట్టారు. మహిళలు పోటాపోటీగా జై శ్రీరామ్ అంటూ రథాన్ని లాగి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మూడురోజులుగా జరుగుతున్న వేడుకలకు బంధు మిత్రుల రాకతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది.

అర్జీల విచారణలో అలసత్వం తగదు

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపికృష్ణ సూచించారు. సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాస్ పుస్తకాలు, స్పందన అర్జీలపై మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు స్పందన అర్జీలను త్వరగా విచారించాలన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలని, విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాలను త్వరగా అందించడంతో పాటు గ్రామాల్లో ఎక్కడా కూడా అనధికార లేఅవుట్లు వేయకుండా కట్టడి చేయడంతో పాటు నీటి తీరువా వసూళ్లు చేయాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అధికారులు ప్రసన్న, శేఖర్, సత్యం ఉన్నారు.

యానాదుల చేపల వేటను అడ్డుకోవడం తగదు



మాట్లాడుతున్న యానాది సంఘం నాయకుడు ప్రసాద్

వేటపాలెం: యానాదులు కాలవల్లో సాగిస్తున్న చేపల వేటను అడ్డుకొంటున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదివాసీ మత్స్య ఉత్పత్తిదారుల పరస్పర సహకారం సంఘం లిమిటెడ్ నాయకులు కొమరగిరి వెంకట ప్రసాద్ డిమాండ్ చేశారు. రామన్నపేట బాపయ్య నగర్‌లోగల యానాది సంఘం మత్స్యకార సొసైటీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. పల్లెకారులు, మరి కొంత మంది అగ్రవర్ణాల వారు చట్ట విరుద్ధంగా స్ట్రయింట్ కట్ కాలవకు అడ్డుకట్ట వేశారని వాపోయారు. సహజసిద్ధంగా యానాదులు వేటను.. పల్లేకారులు, అగ్రవర్ణాలవారు అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. యానాది సొసైటీ సంఘం నాయకులు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. వెంటనే అధికాలు స్పందించి బోగస్ సొసైటీ పేరుతో సాగిస్తున్న ఆక్రమాలను అడ్డుకోవాలని.. చేపలు పట్టుకొని జీవనం సాగించే యానాదులను న్యాయం జరిగేలా చూడాలని కోరారు. వేటగిరి సంజీవరావు, గందళ్ల నరేష్, చేపూరి నాగబాబు, రావూరి సుబ్బారావు, చేపూరి ఆనంద్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం



జె. పంగులూరు: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పద్మజ



చినగంజాం: ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

జె.పంగులూరు: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని వారికి తప్పనిసరిగా ఇవ్వాలని అంగన్‌వాడీ ముప్పవరం సెక్టర్ సూపర్ వైజర్ పద్మజ అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యతను గురించి పంగులూరులో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. తల్లిపాలలో అన్ని రకాల పోషకాలుంటాయని, ఆ పోషకాలు బిడ్డ ఎదుగుదలకు, ఆరోగ్యానికి ఎంతో అవసరమని తెలిపారు. తల్లిపాలు తాగినందు వలన బిడ్డకు అనేక రకాల వ్యాధులు కూడా దూరం అవుతాయని తెలిపారు. తల్లులు తప్పనిసరిగా కేంద్రాల్లో ఇచ్చే ఆహారం పదార్థాలు తినాలని తెలిపారు. తల్లి ఆరోగ్యంగా ఉంటే బిడ్డకు కావాల్సిన పాలు వస్తాయని అందువలన తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. పోషణ్ పక్వాడా కార్యక్రమం ఏప్రిల్ 8 నుంచి 22 వరకు జరుగుతాయని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు లత, సుకన్య, రజిని, పిరాబి, అన్నమ్మ, సులోచన తల్లులు పాల్గొన్నారు.

చినగంజాం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వెబ్ కాస్ట్ లింక్‌పై అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని నాలుగు అంశాలుగా విభజించాలన్నారు. 1000 రోజుల సంరక్షణ, లబ్ధిదారులు తమంతట తాము సోషల్ ట్రాకర్‌లో నమోదు చేసుకునే విధానం, కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ కార్యక్రమం, పిల్లల్లో ఊబకాయం తగ్గించడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లుకు సంబంధించి 15 రోజుల్లో లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్‌లు కె. వాణిశ్రీ, ఎస్. సుమలత, కె. ఉషాకుమారి, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

స్వర్ణ (కారంచేడు): గర్భిణులు క్రమం తప్పకుండా అవసరమైన అన్ని రకాల పరీక్షలు చేయించుకోనేలా ఏఎన్ఎంలు, ఆశలు ప్రోత్సహించాలని.. స్థానిక వైద్యాధికారి ఎం. శాలిని అన్నారు. మంగళవారం స్వర్ణ పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది సమావేశంలో మాట్లాడారు. గర్భిణులు 12 వారాల వచ్చినప్పటి నుంచి తమ పేర్లు ఏఎన్ఎంల వద్ద నమోదు చేయించుకోవడం, పరీక్షలు చేయించుకోవడం చేయాలన్నారు. రక్తహీనతతో ఇబ్బంది పడే వారిని గుర్తించి ఐరన్, కాల్షియం మాత్రలు, సిరప్‌లు కూడా అందించాలన్నారు. మద్యం, పొగాకు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. డెలివరీ సమయంలోను 108 వాహనం వినియోగించుకోవచ్చన్నారు. ఎంపీహెచ్ఈఓ వి. నాగేశ్వరరావు, నోడల్‌ఆఫీసర్ మాధురీ సిఫోరా, హెచ్ఈ మీనాకుమారి, అన్ని గ్రామాలకు చెందిన ఏఎస్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కారంచేడు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు, బిడ్డలకు కూడా అందించాలని ఎంపీడీఓ కె. నేతాజీ అన్నారు. మంగళవారం కారంచేడు ఎంపీడీఓ కార్యాలయం నుంచి కాలువ సెంటర్ వరకు నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవ అవగాహన ర్యాలీలో మాట్లాడారు. కారంచేడు, స్వర్ణ సెక్టార్స్ సూపర్‌వైజర్లు సునీత, హిమబిందు మాట్లాడుతు ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏడవ పోషణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రోజూ ఒక అంశంపై ప్రజల్లో అవగాహన, చైతన్యం కలిగించేలా ఈ నెల 22వ తేదీ వరకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. హౌసింగ్ ఏఈ ఖాసీం సాహెబ్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



కారంచేడులో అవగాహన ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు



స్వర్ణలో వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ శాలిని

భూసార పరీక్షలు తప్పనిసరి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ మోహనరావు

పర్చూరు(చినగంజాం): రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని పర్చూరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్. మోహనరావు అన్నారు. మండలంలోని నాలుగు మండలాల రైతు సేవా కేంద్రాల సిబ్బందికి పర్చూరు మార్కెట్ యార్డు ఆవరణలో ఏడీఏ మోహనరావు అధ్యక్షతన శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ముందుగా ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. దీనివలన భూమిలో ఏయే పోషకాలు ఉన్నాయో, ఏ పోషకాలు ఎంత మోతాదులో కావాలో తెలుసుకోవచ్చునన్నారు. నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు ఎంత శాతం ఉన్నాయో తెలుసుకోవచ్చునని తెలిపారు. అదే విధంగా రైతులు తమ భూములు చౌడు భూములో కాదో తెలుసుకోవచ్చని తెలిపారు. రైతులు తమ పొలాలను పచ్చి రొట్ట ఎరువులతో సాగు చేసుకొని సారవంతం చేసుకోవాలని వివరించారు. పంటపొలాలు ఖాళీగా ఉన్నప్పుడు జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలు చల్లి, భూసారాన్ని వృద్ధి చేసుకోవాలని తెలిపారు. పచ్చి రొట్ట పెంచినందువలన ఎరువులు తగ్గించుకోవచ్చునని తెలిపారు. ఖరీఫ్ 2025లో భాగంగా పర్చూరు సబ్ డివిజన్‌లోని నాలుగు మండలాల్లో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంకొల్లు మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులందరికీ త్వరితంగా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలని చెప్పారు. గుర్తింపు సంఖ్య ద్వారానే రైతులకు వ్యవసాయ శాఖలో వచ్చే అన్ని పథకాలు ఇస్తారని చెప్పారు. ఇప్పటి వరకు సబ్ డివిజన్‌లో 75 శాతం రైతులకు గుర్తింపు సంఖ్యలు ఇచ్చామని వివరించారు. కారంచేడు మండల వ్యవసాయాధికారి సుధీర్ బాబు మాట్లాడుతూ సిబ్బందికి మట్టి నమూనాలు తీసే విధానం గురించి వివరించారు. యద్దనపూడి వ్యవసాయాధికారి ఎన్. మేరిమ్మ మాట్లాడుతూ రబీలో ఇచ్చిన వ్యవసాయ పనిముట్లు.. రైతుసేవా కేంద్రం సిబ్బంది రైతుల ద్వారా త్వరగా కట్టించాలని తెలిపారు. ఏఈఓ రాధ, సీనియర్ అసిస్టెంట్ సాగర్, వీఎస్ఏలు, వీహెచ్ఏలు, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

అద్దంకి రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని బైక్ ఢీకొట్టగా గాయాలైన సంఘటన సోమవారం అద్దంకి మండలంలో చోటు చేసుకుంది. వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై ఖాదర్‌బాషా కేసునమోదు చేశారు. కోనసీమ జిల్లా కాజులూరు మండలం గొల్లాపాలెం గ్రామానికి చెందిన కట్టమూరి అప్పన్న తన బంధువులు అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం సమీపంలోని గురువయ్య ఇటుకల బట్టీలో పనిచేస్తున్నారు. ఈ నేత్యంలో సోమవారం అప్పన్న..తన బంధువుల వద్దకు వచ్చాడు. తన మామతో కలిసి బట్టీ వద్దనున్న టిస్టాల్‌లో టీ తాగి తిరిగి బట్టీ వద్దకు వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై దర్శి వైపు నుంచి వస్తూ అప్పన్నను ఢీకొట్టగా.. గాయాల పాలయ్యాడు. స్థానికులు, బంధువులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలు తరలించారు.

200 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



పోలీస్‌స్టేషన్ వద్ద అక్రమ రేషన్‌బియ్యంతో ఎస్ఐ వెంకట్రావు

కారంచేడు: అక్రమంగా తరలిస్తున్న పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని కారంచేడు పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం కారంచేడు ఎస్ఐ వి. వెంకట్రావు సాధారణ తనిఖీల్లో భాగంగా రామానాయుడు కల్యాణ మండపం సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్నాడు. ఈ క్రమంలో చీరాల మండల జాండ్రపేట వైపు నుంచి నర్సరావుపేటకు తరలిస్తున్న 200 బస్తాలు (50కేజీల టిక్కీలు) ఐషర్ వాహనం ఆపి తనిఖీ చేయగా రేషన్ బియ్యం ఉన్నాయన్నారు. దీంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని చెప్పారు. వాహనాన్ని సీజ్ చేసి కారంచేడు పోలీస్టేషన్‌కు తరలించామన్నారు. బియ్యాన్ని వీఆర్ఓలు శివశంకరరావు, పి. కోటేశ్వరరావులకు అప్పగించామని తెలిపారు.

శనగలో తేమశాతం 14కు మించకూడదు



శనగల కొనుగోలు గురించి రైతులకు వివరిస్తున్న అధికారులు

జె.పంగులూరు: పంగులూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనగల కొనుగోలు కేంద్రంలో జె.జె-11 రకం శనగలు కొనుగోలు చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి డి. సుబ్బారెడ్డి తెలిపారు. శనగల విక్రయాల్లో పాటించాల్సిన నిబంధనలను ఏవో సుబ్బారెడ్డి, పీఏసీఎస్ సీఈఓ లక్ష్మి మంగళవారం రైతులకు వివరించారు. శనగ రైతులు తమ పంట విక్రయానికి రైతు సేవా కేంద్రాల్లో పేరు నమోదు చే సుకోవాలని, నిర్ణీత సమయంలో పంటను అమ్ముకునే అవకాశం ఉందని తెలిపారు. క్లీనింగ్ కోసం డి స్టోన్ చేయించాలని తేమశాతం 14 కు మించకుండా ఉండాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో జేజే-11 రకం శనగలు క్వింటాకు రూ. 5650 ధర నిర్ణయించడం వలన జరిగిందని తెలిపారు. పంగులూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారి ఆధ్వర్యంలో శనగలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం చైత్ర మాసం మఘ నక్షత్రం ద్వాదశి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఆవులకు దాణా బస్తాల అందజేత

అద్దంకి: హరిహర గోశాలలోని ఆవులకు రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం ఏడు తౌడు బస్తాలు అందజే శారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సభ్యులు పాల్గొన్నారు.